సాక్షి
వికారాబాద్

బుధవారం ၊ 5 ၊ ఏప్రిల్ ၊ 2023



పర్మినెంట్ చేయరాయె..

ఉద్యోగాల్లో చేరి నాలుగేళ్లు కావస్తున్నా రెగ్యులరైజ్ చేయడం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 8లో▸




అవినీతికి నిదర్శనం కాళేశ్వరం

రాష్ట్ర ప్రభుత్వ అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టే నిదర్శనమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ అన్నారు. 8లో▸



ఉపాధి కూలీలకు ఊరట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోజు వారీ వేతనాన్ని పెంచుతూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 9లో▸



న్యూస్‌రీల్

ఘాటెక్కిన ఎండు మిర్చి

కిలో రూ. 220



పెద్దేముల్ సంతలో ఎండు మిర్చి

పెద్దేముల్: ఎండు మిర్చి ధరలు భగ్గు మంటున్నాయి. గత ఏడాది కిలో రూ. 120 కాగా ఏడాది కిలో రూ. 220కి చేరుకుంది. మంగళవారం పెద్దేముల్ సంతలో కిలో ఎండు మిర్చి రూ. 210 నుంచి రూ. 220 వరకు పలికింది. దీంతో సామాన్య ప్రజలు ఎండు మిర్చి కొనేందుకు సంకోచించారు. రెండేళ్లుగా కిలో రూ. 90, నుంచి రూ.120 మాత్రమే ఉన్న ఎండు మిర్చి నేడు రూ. 220కి చేరడంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కిలో పచ్చి మిర్చి ధర కూడా రూ.60 నుంచి రూ.80కి చేరింది.

కొర్రమీను చేపల పెంపకంపై శిక్షణ రేపు

వికారాబాద్ అర్బన్: షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులకు కొర్రమీను చేపల పెంపకంపై అవగాహన, శిక్షణ కల్పించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబుమోజెస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. సొంత భూమి కలిగి, గ్రామీణ ప్రాంతాల్లోని వారైతే సంవత్సరానికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని వారైతే రూ.2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డు కలిగిన వారు గురువారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని రూమ్ నంబర్ ఎస్‌- 11లో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

కొడంగల్ రూరల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని మైసమ్మ తండా, పోశమ్మ తండాల్లో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ ప్రశాంత్, నాయకులు సోమశేఖర్, తార్యానాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పనుల పరిశీలన



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను వేగంగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్‌నగర్‌లోని మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు, అనంతగిరిలోని కళాశాల తరగతి గదుల నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వైద్య విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యే నాటికి వసతులు పూర్తి చేయాలన్నారు.

కుదరని రాజీ



వికారాబాద్
బీఆర్‌ఎస్‌లో ముసలం

- రెండు వర్గాలుగా చీలిన పార్టీ కేడర్
- ఎమ్మెల్యే ఆనంద్‌పై అసమ్మతి నేతల గుర్రు
- మంత్రి సబితారెడ్డి వద్దకు చేరిన పంచాయితీ
- ఆనంద్‌తో కలిసేది లేదంటున్న వైరి వర్గం
- 16న నిర్వహించాల్సిన సమావేశానికి తాత్కాలిక బ్రేక్

వికారాబాద్: బీఆర్‌ఎస్‌లో వర్గపోరు ముదిరి పాకాన పడింది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, అతని అసమ్మతి వర్గానికి మధ్య తలెత్తిన వివాదం చినికిచినికి గాలివానలా మారింది. ఇరువర్గాల నేతలు ఇటీవల ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకోవటంతో పాటు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఆత్మీయ సమ్మేళనాలను వేర్వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల అసమ్మతి నేతలు నిర్వహించిన సమ్మేళనాన్ని ఆనంద్ మద్దతుదారులు అడ్డుకున్నారు. టెంట్లు తొలగించి, కుర్చీలు విసిరేశారు. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను అదుపు చేయడంతో పరిస్థితి చేజారలేదు. ఆ తర్వాత విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసిన ఇరువర్గాల నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

ఇరువర్గాలతో మంత్రి భేటీ

ఇరువర్గాలకు చెందిన నేతలు మీడియా వేదికగా ఎదుటి వర్గంపై బూతు పురాణంతో విరుచుకుపడ్డారు. దీంతో ఈ పంచాయితీ అధిష్టానం వద్దకు చేరింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పార్టీ పెద్దలు గొడవ మరింత పెద్దది కాకుండా చూడాలని మంత్రి సబితారెడ్డికి సూచించారు. ఇదే సమయంలో అసమ్మతి నేతలు తనకు తలనొప్పిగా మారారని, వారిని పిలిచి మాట్లాడాలని ఎమ్మెల్యే ఆనంద్ సైతం మంత్రికి మొర పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పందించిన మంత్రి సోమవారం ఇరువర్గాల నేతలను హైదరాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకున్నట్లు సమాచారం. మే 16న వికారాబాద్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామని అసమ్మతి వర్గం నేతలు గతంలోనే ప్రకటించగా.. మంత్రి సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తామని చెప్పినట్లు వినికిడి. ఈ ఒక్క అంశం మినహాయిస్తే మంత్రి నిర్వహించిన భేటీలోనూ ఇరువర్గాల మధ్య సయోధ్య కుదరలేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఇంకెవరైనా ఓకే..

మంత్రి సబితారెడ్డి సమక్షంలో నిర్వహించిన సమావేశంలోనూ తాము ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి పని చేసే ప్రసక్తే లేదని అసమ్మతి నేతలు తేల్చిచెప్పినట్లు సమాచారం. అయితే ఇతర పార్టీలతో కుమ్మక్కైన కొంతమంది నాయకులు ఇలాంటి కుట్ర చేస్తున్నారని, వీరంతా త్వరలోనే పార్టీని వీడేలా ప్లాన్ చేసుకుని.. బీఆర్‌ఎస్‌లో చిచ్చు పెడుతున్నారని ఎమ్మెల్యే మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. వైరివర్గం నేతలు సైతం వీరి విమర్శలను అదే స్థాయిలో తిప్పి కొడుతున్నారు. బీఆర్‌ఎస్‌లో ఆనంద్‌కన్నా తామే సీనియర్లమని, వికారాబాద్‌లో పార్టీ ఫౌండర్లమే తామని.. తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో పాటు లేనిపోని గొడవలను ప్రోత్సహించి పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారని మంత్రికి చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్ని అవమానాలు ఎదురైనా పార్టీని వీడేది లేదని.. అలాగని ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి పనిచేసేది కూడా లేదని ముక్తకంఠంతో చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆనంద్ మినహా మరెవరిని సూచించినా తమకేం ఇబ్బంది లేదని మంత్రికి వివరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇంకెంత దూరం వెళ్తుందోనని గులాబీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇసుక ధర రూ.600

- తరలించే ప్రతీ వాహనానికి జీపీఎస్
- అక్రమ రవాణా చేస్తే రూ.25 వేల జరిమానా
- రెండోసారి దొరికితే ట్రాక్టర్ సీజ్
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పనులకు వినియోగించే ఇసుక ధరను తగ్గించామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు లోడ్ (ట్రాక్టర్) రేటు రూ.1,800 ఉండగా ఈ మొత్తాన్ని రూ.600గా నిర్ధారించామని వెల్లడించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అవసరమైన వారు ఇసుక అనుమతుల కోసం సంబంధిత మండలాల తహసీల్దార్లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తున్న చేసుకున్న వారికి మ్యాన్యువల్‌గా పర్మిషన్ జారీ చేస్తారని తెలిపారు. పదిహేను రోజుల్లో సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ఇసుక తరలించే ప్రతీ వాహనానికి జీపీఎస్ అమర్చి అక్రమ రవాణాను అరికడుతామని స్పష్టంచేశారు. మొదటిసారి పట్టుబడిన వారికి రూ.25 వేల జరిమానా విధిస్తామని, రెండోసారి దొరికితే వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, మైన్స్ ఏడీ సాంబశివరావు, ఇరిగేషన్ ఈఈ సుందర్, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై పర్యవేక్షణ

పదో తరగతి పరీక్షలు పూర్తయ్యేవరకు రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు పూర్తి పర్యవేక్షణ కొనసాగాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయా శాఖలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని కేంద్రాల వద్ద నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఎస్‌హెచ్‌ఓలు పూర్తి బాధ్యత వహిస్తూ సెంటర్లలోకి ఎవరూ సెల్‌ఫోన్లు తేకుండా కట్టడి చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ జరిగితే ఇన్విజిలేటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

పలు సెంటర్ల తనిఖీ

వికారాబాద్‌లోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. న్యూ నాగార్జున ఉన్నత పాఠశాల, ఆలంపల్లి జెడ్పీహెచ్‌ఎస్, కొత్తగడిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేంద్రాలను పరిశీలించారు.

ఇళ్ల పట్టాలతో పేదల జీవితాల్లో వెలుగులు

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: సొంతింటి కలను సాకారం చేసి నిరుపేదల జీవితాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెలుగులు నింపారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లో 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న 305 మంది లబ్ధిదారులకు మంగళవారం జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ జీవోతో గతంలో 2014 సంవత్సరం వరకు మాత్రమే అవకాశం ఉండగా, ప్రస్తుతం 2020 సంవత్సరం లోపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఏప్రిల్ చివరి నాటికి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని తెలిపారు. పేద ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ జనార్దన్‌రావు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ మండల కార్యాలయంలో..

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు జీవో 58, 59లతో ఎంతో లబ్ధి చేకూరుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ మండల కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల చివరి వరకు సీఎం కేసీఆర్ సమయం ఇచ్చారని, అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, యెగ్గె మల్లేశం, కందుకూరు ఆర్డీఓ సూరజ్, తహసీల్దార్ జయశ్రీ, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేషన్‌లో ఫోర్టిఫైడ్ బియ్యం

- 588 దుకాణాల ద్వారా పంపిణీ
- పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 588 రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం అందించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం రేషన్ డీలర్లు, ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ బియ్యం అంటే పోషకాలతో కూడిన బలవర్ధకమైన బియ్యమని, ఇందులో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి- 12 నిర్ధారిత మోతాదులో కలిపి ఉంటాయని స్పష్టంచేశారు. చూసేందుకు సాధారణ బియ్యం మాదిరిగానే కనిపించినా..మంచి పోషక విలువలు ఉంటాయన్నారు. రోజూ మాదిరిగానే వండుకోవచ్చని, నిల్వ చేసేందుకు ప్రత్యేక పద్ధతులు అవసరం లేదని తెలిపారు. అన్నం రంగు,రుచి, వాసనలో కూడా ఎలాంటి తేడా ఉండదన్నారు.ప్రభుత్వ రేషన్ దుకాణాలతో పాటు మధ్యాహ్న భోజన పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలు,అంగన్‌వాడీలకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విమల, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకరెడ్డి పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- తాండూరులోని ప్రభుత్వ- 1 పాఠశాలలో తనిఖీ
- నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు వెల్లడి

తాండూరు: పదో తరగతి పరీక్షల విధులు నిర్వర్తిస్తున్న వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ నంబర్- 1 పాఠశాల సెంటర్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. సోమవారం జరిగిన పేపర్ లీకేజీ సంఘటనపై ఎంఈఓ వెంకటయ్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, మిగతా అధికారులు ఎవరూ సెంటర్‌లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. పేపర్ అవుట్ చేసిన ఉపాధ్యాయుడు బందెప్పతో పాటు మరో ముగ్గురు టీచర్లపై సస్పెన్షన్ వేటు వేశామన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఇన్విజిలేషన్ విధుల నుంచి తొలగించామని స్పష్టంచేశారు. జిల్లాలో మొత్తం 13,413 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయాల్సి ఉండగా.. 13,350 మంది ఎగ్జామ్స్‌కు హాజరవుతున్నారని స్పష్టంచేశారు. జిల్లా వ్యాప్తంగా 1,012 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పరీక్ష విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎగ్జామ్ డ్యూటీ కేటాయించిన ఉపాధ్యాయులు నిబంధనలను పాటించాలని పదే పదే చెప్పామని తెలిపారు. టీచర్ బందెప్ప ఎగ్జామ్ పేపర్‌ను వాట్సాప్ ద్వారా బయటకు పంపించడాన్ని నేరంగా పరిగణించామన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న వారి వివరాలపై పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెట్టారని వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని స్పష్టంచేశారు.

పటిష్ట బందోబస్తు..

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. పట్టణంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్, ప్రభుత్వ- 1 పాఠశాల పరీక్ష సెంటర్లను తనిఖీ చేశారు. సెంటర్ల వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రశ్నప్రతం లీక్ చేసిన ఉపాధ్యాయుడితో పాటు మాల్ ప్రాక్టీస్‌కు కారణమైన వారిని గుర్తిస్తున్నామని స్పష్టంచేశారు. ఆయన వెంట సీఐ రాజేందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కొడంగల్ కోర్టుకు నిందితులు

కొడంగల్: పదో తరగతి పేపర్ లీకేజీలో నిందితులుగా ఉపాధ్యాయులు బందెప్ప, సమ్మప్పను మంగళవారం రాత్రి 7 గంటలకు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తాండూరులో జరిగిన సంఘటపై కేసు నమోదు చేసిన అక్కడి పోలీసులు.. నిందితులను కొడంగల్ కోర్టులో హాజరు పర్చారు. వీరిపై ఐపీసీ 409, 109 సెక్షన్ల కింద కేసులు నమోదచేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితులను రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో ఇద్దరినీ పరిగిలోని జైలుకు తరలించారు.



తాండూరులోని నంబర్- 1 పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

మేమేం పాపం చేశాం

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన

- తమకు కూడా పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్
- ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపాటు
- ప్రభుత్వం స్పందించాలని అభ్యర్థన

వికారాబాద్ అర్బన్: వేలాది మంది కూలీలను సమన్వయం చేసుకుంటూ, నిత్యం వారికి పని కల్పిస్తూ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న ఉపాధి హామీ ఉద్యోగులకు సరైన వేతనం దక్కడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ఏ పని పూర్తి చేయాలన్నా వీరు కీలకంగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయడంతో పాటు వలసల నివారణకు కృషిచేస్తున్న తమకు పనికి తగిన వేతనం అందడం లేదని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, మన ఊరు- మనబడి కింద పాఠశాలల ప్రహరీలు, వంట గదుల నిర్మాణ పనులు సైతం వీరి సమక్షంలోనే నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్లు, మొక్కలు నాటడం, ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు నిర్మాణం వంటి పనులతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇలా ప్రతి పనిలో పాలు పంచుకుంటున్నా సరైన వేతనాలు, ఇతర అలవెన్సులకు నోచుకోవడం లేదని చెబుతున్నారు. గత మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్, ఐకేపీ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రామ స్థాయిలో వారితో సమానంగా పనిచేస్తున్న తమకు సైతం పీఆర్సీ వర్తింపజేయాలని కోరుతున్నారు.

ఏళ్లుగా పనిచేస్తున్నవాళ్లే..

జాతీయ ఉపాధి హామీ పథకంలో చాలా మంది ఉద్యోగులు కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఆయా విభాగాల్లో ఇరవయ్యేళ్లకు పైగా పనిచేస్తున్న వారు సైతం ఉన్నారు. ప్రభుత్వం డీఆర్‌డీఏ, డ్వామాలను విలీనం చేసినా ఐకేపీ, ఈజీఎస్‌లను మాత్రం వేర్వేరుగానే నిర్వహిస్తోంది. ఈ రెండు విభాగాల్లో పనిచేస్తున్న వందల మందికి ఇరవై ఏళ్ల సర్వీస్ ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఐకేపీ ఉద్యోగులకు మాత్రమే పేస్కేల్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఈజీఎస్ ఉద్యోగులు, సిబ్బంది నిరాశకు గురవుతున్నారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న తమకు కనీసం టీఏ, డీఏలు కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని మండిపడుతున్నారు. కేవలం కాంట్రాక్టు పద్ధతిన జీతాలు తీసుకుంటూ పనిచేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న తమకు సైతం పీఆర్సీ వర్తింపజేయాలని కోరుతున్నారు.

పరీక్షల ఆధారంగా..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఈజీఎస్, ఐకేపీలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. చిన్న జిల్లాల ఏర్పాటు అనంతరం ఈజీఎస్, ఐకేపీ ఉద్యోగులకు రాత పరీక్షల ఆధారంగానే పోస్టింగ్‌లు ఇచ్చారు. మండల స్థాయిలో పనిచేసే వారిని కూడా పరీక్షల అనంతరమే విధుల్లో చేర్చుకున్నారు. ఇలా పరీక్షల సామర్థ్యంతో ఎంపికైన తమకెందుకు పీఆర్సీ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రెండు విభాగాలు వేర్వేరుగా పనిచేస్తున్నప్పటికీ.. వీరి ఉన్నతస్థాయి అధికారి ఒక్కరే కావడం గమనార్హం. హరితహారం విజయవంతంలో, గ్రామాల్లోని నర్సరీల నిర్వాహణలో ఈజీఎస్ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. పల్లెప్రగతి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు.



మొక్కలు నాటడాన్ని పర్యవేక్షిస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

ఈజీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు		
ఏపీడీ	-	01
ఏపీఓ	-	13
ఈసీ	-	14
టీఏ	-	99
జేఎఫ్‌టీ	-	04
సీఓ	-	50
పీఎస్	-	03
ఫీల్డ్ అసిస్టెంట్లు	-	400

మా శ్రమను గుర్తించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాల అమలులో ఈజీఎస్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ స్థాయిలో వేల మంది కూలీలను సమన్వయం చేస్తూ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నాం. ప్రభుత్వం మా శ్రమను గుర్తించడం లేదు. గతంలోనే ఈజీఎస్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, పే స్కేల్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. మాకు కూడా పీఆర్సీ ఇవ్వాలి. లేదంటే ఆందోళన తప్పదు.

– సుధాకర్, ఈజీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

బొగ్గు లారీ బోల్తా..
డ్రైవర్‌కు గాయాలు



కేరెళ్లి సమీపంలో బోల్తాపడిన బొగ్గులారీ

ధారూరు: బొగ్గు లారీ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి తాండూరులోని ఓ ఫ్యాక్టరీకి బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ అనంతగిరిగుట్ట దిగిన తర్వాత కేరెళ్లి సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానికులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

'ఉపాధి'ని పారదర్శకంగా చేపట్టాలి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కృష్ణన్

మర్పల్లి: ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా చేపట్టాలని గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కృష్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను పర్యవేక్షించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలను పరిశీలించారు. మొక్కల పెంపకంలో అలసత్వం వహించరాదన్నారు. ఆయన వెంట ఏపీఓ అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగయ్య, ఈసీ విఠల్, టీఏ భాస్కర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అవినీతి రహిత పాలన బీజేపీకే సాధ్యం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీకే సాధ్యమని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘనపురం వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఘనపూర్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వ విధానంతో వ్యవహరిస్తున్నదని, ఉద్యోగ నియామకాలలో విఫలమైందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, రఘు, భీమయ్య స్థానిక నేతలు పాల్గొన్నారు.

నాలుగేళ్లవుతున్నా పర్మినెంట్ చేయరాయె

- ఎవరికీ పట్టని జూనియర్ కార్యదర్శుల గోడు
- అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నా కొరవడిన భద్రత
- అరకొర వేతనాలతో బతుకులు దుర్భరం



సంగాయిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: 'రెగ్యులరైజ్ అవుతుందన్న ఆశతో ప్రభుత్వం చెబుతున్న పనులన్నీ చేస్తున్నాం. గ్రామాల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. కానీ తమ జీవితాలకు మాత్రం భద్రత లేకుండా పోయింది' అని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఈనెల 10 నాటికి ఉద్యోగంలో చేరి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకు రెగ్యులరైజ్ కాలేదంటున్నారు. పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల గోడును ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక పంచాయతీ కార్యదర్శుల పోస్టుల్లో చేరిన తమపై నిర్లక్ష్యాన్ని వీడాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల పేరుతో ప్రభుత్వం మూడు ముక్కలుగా విభజించి కొందరిని సీనియర్ కార్యదర్శులు (గ్రేడ్ 1) అని, మరికొందరిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులని, మరికొందరిని ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులని నామకరణం చేసింది.

ఓపీఎస్ కార్యదర్శుల ఆగచాట్లు..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు నాలుగు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటి వరకు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చామని రెగ్యులర్ కార్యదర్శులతో సమానంగా పనిచేయిస్తారని, వేతనాలు మాత్రం చెల్లించడంలేదని పేర్కొంటున్నారు. జిల్లాలో 402 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 29 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు జిల్లాలో మంది పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.15వేలు మాత్రం వేతనం. ఇది వారి ప్రయాణాల ఖర్చులు, ఇతరత్ర ఖర్చులకు సరిపోవడంలేదంటున్నారు.. ఏడాదిగా ప్రతి నెలా వేతనాలు ఆసల్యంగా చెల్లిస్తున్నారని అంటున్నారు.

కనీస వేతనం అమలేదీ?

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రూ.28,719 వేతనం ఇస్తూ ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు రూ.15వేలు అందిస్తున్నారు. అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియదని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటున్నారు.

కొరవడిన భద్రత..

పంచాయతీ కార్యదర్శులు ప్రమాదాల బారినపడి మరణిస్తే ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. ఉద్యోగంలో చేరినప్పుడు ప్రొబేషన్ పీరియడ్ మూడేళ్లు అని చెప్పిన ప్రభుత్వం ఆ తర్వాత మరో ఏడాది పొడిగించింది. దీంతో ఈనెల 10వ తేదీతో సర్వీసు పూర్తయిన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది. కొందరు ప్రమాదాల బారిన పడి, మరికొందరు పని ఒత్తిడి తట్టుకోలేక ఇతరత్ర కారణాలతో మరణిస్తే ఎలాంటి ప్రయోజనాలు అందకపోవడంతో ఆ కుటుంబాలు దిక్కులేని వారిగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి తమను కూడా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పరిగణించి ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాని వేడుకుంటున్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి



ప్రభుత్వం జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు పరిష్కరించాలి. నాలుగేళ్లవుతున్నా ఎలాంటి ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనం లేదు. పల్లెల్లో పంచాయతీ కార్యదర్శులు పనిఒత్తిడితో చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను పరిష్కరించాలి.
– ప్రవీణ్‌కుమార్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల గౌరవ అధ్యక్షుడు

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న సర్కార్



ఎన్టీఆర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ నాయకుల నిరసన

అనంతగిరి: పదో తరగతి పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగిందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి అన్నారు. లీకేజీకి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీతోనే నిరుద్యోగుల భవిష్యత్తును నాశనం చేసిందన్నారు. అది మరవకముందే పదో తరగతి పేపర్ లీక్ చేసిన ఘటనతో విద్యావ్యవస్థ ఎలా కొనసాగుతుందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తోందని ఆయన మండిపడ్డారు. అనంతరం నాయకులను పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ నిర్లక్ష్యం వల్లే పేపర్ లీకేజీలు

- బీజేవైఎం నాయకుల మండిపాటు
- కేసీఆర్, సబితారెడ్డి దిష్టిబొమ్మల దహనం



తాండూరులో కేసీఆర్, సబితారెడ్డిల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

తాండూరు టౌన్: పేపర్ లీకేజీలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీజేవైఎం అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో సీఎం కేసీఆర్‌తో పాటు విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ, ఎస్సెస్సీ పరీక్షల పేపర్ లీకేజీలకు ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణే కారణమన్నారు. అధికార యంత్రాంగంపై సంబంధిత మంత్రిత్వ శాఖకు పట్టు లేకపోవడం దీనికి నిదర్శనమన్నారు. అలాగే ఏ శాఖలో ఏం జరుగుతున్నదో అనే విషయం పాలక వర్గానికి తెలియక పోవడం సిగ్గు చేటన్నారు. అటు నిరుద్యోగులు, ఇటు విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, నాయకులు పూజారి పాండు, ప్రకాశ్, మహేశ్, బీజేవైఎం నాయకులు కిరణ్, రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, అబ్బాస్, జగన్, తాండ్ర నరేష్, సంజయ్, భాను తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు రాజీనామా చేయాలి

వికారాబాద్ అర్బన్: పేపర్ లీకేజీలపై మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి బాధ్యత వహిస్తూ పదవులకు రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్–1 పేపర్ లీకేజీతో 30లక్షల మంది నిరుద్యోగుల బతుకులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కనీసం వారిలో ఆత్మస్థైర్యం కలిగే విధంగా కూడా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. గ్రూప్–1 పేపర్ లీకేజీలో ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపడితే అసలు విషయాలు బయటకు వస్తాయన్నారు. తాండూర్‌లో 10వ తరగతి తెలుగు పరీక్ష పేపర్ లీక్ కావడం వెనుక కార్పొరేట్ పాఠశాలల హస్తం ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంపై కూడా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టే నిదర్శనం



గురుదోట్ల గ్రామంలో జరిగిన సమావేశంలో విశ్వేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్

ధారూరు: రాష్ట్ర ప్రభుత్వ అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టే నిదర్శనమని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి ఎ. చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని అంపల్లి, నాగారం, గురుదోట్ల గ్రామాల్లో మంగళవారం బూత్‌స్థాయి కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అక్షరాల రూ.లక్షన్నర కోట్లు వెచ్చించారని అన్నారు. కేవలం రూ.36 వేల కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్టు ఇన్ని డబ్బులు వెచ్చించారంటే ఆ మిగిలిన నిధులు ఎక్కడికి వెళ్లాయో అర్థం చేసుకోవాలని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. పంజాబ్ రైతులకు చెక్కులు పంచిన కేసీఆర్ తెలంగాణ రైతుల్ని పిలిచి ఒక్కసారైనా మాట్లాడారా అంటూ వారు ప్రశ్నించారు. కేసీఆర్ బతికి ఉండగానే కేసీఆర్ కిట్ పేరున పథకాన్ని పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. అదే వైఎస్సార్, ఎన్టీరామారావు, ఇందిరాగాంధీలు బతికి ఉండగా వారి పేరిట పథకాలు పెట్టుకోలేదని, దివంగతులైన తర్వాతే వారి పేరిట పథకాలు వచ్చాయని గుర్తు చేశారు. కేసీఆర్ కిట్ పథకానికి కేంద్రమే 60 శాతం నిధులు సమకూరుస్తోందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద గ్రామాలకు, తండాలకు సీసీ రోడ్ల కోసం నిధులిస్తే ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ టీఆర్ఎస్ గొప్పలు చెప్పుకుంటోందని వారు విమర్శించారు. కేంద్రం నిధులివ్వకంటే గ్రామ పంచాయతీల మనుగడ సాధ్యమయ్యేదా అని వారు ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో నిధులను కేసీఆర్ దోచుకుంటున్నారని మండిపడ్డారు. రచ్చబండల వద్ద ప్రభుత్వ వ్యతిరేక చర్యలను ఎండగట్టాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఐదేళ్ల క్రితం తాండూరు–వికారాబాద్ ప్రధాన రోడ్డుకు నిధులు మంజూరు చేసినా నేటికీ పనులు పూర్తి కాలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సదానందరెడ్డి, జల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేందుకే పార్టీ మారాను

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



చంద్రవంచలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: 'నేను తాండూరు గడ్డమీద పుట్టిన బిడ్డను.. అభివృద్ధి చేసేందుకే పార్టీ మారాను' అని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బెల్కటూర్, చిట్టిఘణాపూర్, చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్, గోపన్‌పల్లి, గౌతపూర్, చెంగోల్, పర్వాతపూర్, చింతమణిపట్నం గ్రామాల్లో పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాండూరును పాలించిన నాయకులు ఇక్కడి ప్రాంతానికి చెందినవారు కాదన్నారు. తాండూరు అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో గెలిచి తాండూరు అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తెచ్చినట్లు చెప్పారు. తాండూరు మున్సిపాలిటీలో ఒక్కో వార్డుకు రూ.కోటీ, అదేవిధంగా ప్రతి గ్రామానికి రూ.50 లక్షల నిధులు తెచ్చినట్లు చెప్పారు. ఈ పనులు మూడు నెలల్లో పూర్తి అయితే అన్నీ సమస్యలు పరిష్కరం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కరన్‌కోట్ రోడ్డుకు రూ.9.50 కోట్లు మంజూరు

గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి కరన్‌కోట్‌లోని సీసీఐ కాలనీవరకు స్పెషల్ ఫండ్స్ ద్వారా రూ.9.50 కోట్లు మంజూరయ్యాయని...ఆ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. బెల్కటూర్ బ్రిడ్జి నిర్మాణానికి కూడా రూ.3.50 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వడ్డె మధన్ మోహన్, మంజురాణి, శ్రీదేవి, వీణా హేమంత్, పద్మమ్మ, రాజప్ప, మల్లీశ్వరి పాల్గొన్నారు.

యువకుడిపై కత్తులతో దాడి
ప్రేమ వ్యవహారమే కారణం



గాయపడిన రాజు

మోమిన్‌పేట: ఓ యువకుడిపై కత్తులతో దాడి చేసిన ఘటన మంగళవారం మోమిన్‌పేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేటకు చెందిన దబ్బని రాజు ఫాస్టు ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఓ పెళ్లిలో హైదరాబాదు సమీపంలోని హిమయత్‌నగర్‌కు చెందిన యువతితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. కాగా ఆదే గ్రామానికి చెందిన కిరణ్ అనే యువకుడు తనను ప్రేమించాలని ఆ యువతిని తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ విషయమై ఆ యువతి మోమిన్‌పేటకు చెందిన రాజుకు తెలిపి కిరణ్ ఫోన్ నంబరు ఇచ్చింది. దీంతో రాజు కిరణ్‌కు ఫోన్‌చేసి మాట్లాడాడు. ఈ క్రమంలో కిరణ్ తన ఐదుగురు స్నేహితులతో వచ్చి రాజుపై కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

ఠారెత్తిస్తున్న ఎండలు
బంట్వారంలో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

బంట్వారం: ఎండలు ఉగ్రరూపం దాలుస్తున్నాయి. మండల కేంద్రం బంట్వారంలో జిల్లాలోనే అత్యధికంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఇదే మండలంలోని నాగవరం, తొర్మామిడి గ్రామాల్లో కూడా 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు.

పరిహారం పెంచండి



మంత్రి సబితకు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి, రైతులు

- మంత్రి సబితను కోరిన రైతులు
- సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయం చేస్తానని హామీ

చేవెళ్ల: హైదరాబాద్ – బీజాపూర్ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని మంత్రి సబితను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు సీ సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల నాయకులు, రైతులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సబితారెడ్డిని కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. రోడ్డు విస్తరణకు 2018లో నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ 2021 వరకు టెండర్లు పిలువలేదన్నారు. ఇప్పుడు పనులు ప్రారంభించి 2018 ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పడం సరికాదన్నారు. దీని వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తే రైతులకు కొంతలో కొంతైనా ఊరట లభిస్తుందన్నారు. బహిరంగ మార్కెట్ భూముల విలువ కోట్లలో ఉందని, 2018 ప్రకారం పరిహారం చెల్లిస్తే రైతులకు ఎక్కువ నష్టం జరుగుతుందని తెలిపారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నేగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా పట్టా భూములే ఉన్నాయని, అలాంటి వారికి తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంతో చర్చించి రైతులకు పరిహారం పెంచి ఇచ్చేలా చూడాలని కోరారు. అలాగే చేవెళ్ల, మొయినాబాద్‌లలో వస్తున్న బైపాస్ రోడ్డుకు సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. స్పందించిన మంత్ర సబితారెడ్డి పరిహార విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో కూడా చర్చించనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీ ఆగిరెడ్డి, రైతులు పీ దామోదర్‌రెడ్డి, జే శ్రీకాంత్‌రెడ్డి, బీ వెంకట్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభు, నర్సింహారెడ్డి, భోజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన డబ్బాను తొలగిస్తున్న అధికారులు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రమేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన వ్యక్తి రేకులతో డబ్బా వేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో డబ్బాను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎవ్వరూ నిర్మాణాలను చేపట్టరాదని, అలా చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహ స్థాపనను అడ్డుకోవడం తగదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్, ప్రజాసంఘాల నాయకుల ఆందోళన

బషీరాబాద్: మండలంలోని మైల్వార్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహస్థాపనను అడ్డుకోవడం తగదని కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. విగ్రహస్థాపనను అడ్డుకున్న బీఆర్ఎస్ నాయకుడు ఖాలీద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అందజేసిన విగ్రహం ప్రతిష్టాపన కోసం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పునాది తవ్వుతుంటే సర్పంచ్ సీమాసుల్తాన భర్త, మాజీ వైస్ ఎంపీపీ ఖాలీద్, అతడి అనుచరులు దళితులను దూషించారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ హక్కుల జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఆందోళన చేపట్టిన నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో కులవివక్ష, అంటరానితనం కొనసాగడం అమానుషమన్నారు. చాలా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల స్థాపనలో కొంత మంది సర్పంచులు, నాయకులు అడ్డుతగులుతున్నారని, ఎమ్మెల్యే స్పందించి అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ అధ్యక్షుడు సురేశ్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'బలగం'



చేవెళ్ల: ఇటీవల తెలంగాణ గ్రామీణ ప్రాంత నేపథ్యంలో విడుదలై విశేష ఆదరణ పొందిన బలగం సినిమా ఇప్పుడు గ్రామాల్లో ప్రదర్శనలకు వేదికగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు ఈ సినిమాను చూపించేందుకు సిద్ధమయ్యారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. దేవరంపల్లిలో సోమవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి మల్కాపూర్‌లో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, రావుపల్లిలో సర్పంచ్ కే శ్రీనివాస్, రామన్నగూడలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో సినిమాను ప్రదర్శించారు. ఈ నెల 7న చేవెళ్లలో జెడ్పీటీసీ ఎం మాలతి ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్‌పై బలగం సినిమాను ప్రదర్శించనున్నారు. బుధవారం రాత్రి దేవుని ఎర్రవల్లిలో సర్పంచ్ మాణిక్యరెడ్డి, గ్రామ యూత్ ఆధ్వర్యంలో సినిమాను ప్రదర్శించనున్నారు.